కథానిక

# గురితప్పిన శరాలు

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

"ఏమిటమ్మా అబ్బాయికి ఆఫీసులో ఏదో తగూ వచ్చిందట? మా మనవడు చెప్పాడులే. ఇంటిపనంతా ముగించి తీరిక చేసుకొనేసరికి ఈవేళ అయింది. ఎప్పుడడుగుదామా అని మహా తొందరపడ్డాను. మరి- చిరాకేం లేదు కద ?"

తీరికగా కూర్చుంటూ మహాలక్ష్మమ్మ యీ ప్రశ్న వేసింది. కుమితూన్న విస్తరిని ప్రక్కకి తోసి, రాజమ్మ కళ్ళజోడుని యథాస్థానంలో నిక్షిప్తంచేసి అసలు సంగతి చెప్పేసే ప్రయత్నంలోలాగా ఒక్కసారి చూసి చిన్న గొంతుకలో అన్నది:

"రోజులు బాగులేకపోతే ఎలాగుంటుందమ్మా ? అన్నీ వింతలూ, విడ్డూరాలున్నూ. పెద్దలా? గౌరవమా? కలిమహత్యం. ఏమిటంటే ఎవరు ఒప్పుకుంటారు?... ఏం చెప్పగలం గనక?"

తన ప్రశ్నకీ ఈ సమాధానానికీ, భూమి గుండ్రంగా ఉండడానికీ, మనుష్యులు గడ్డి తినాలనేదానికీ ఉన్నంతే సంబంధం ఉన్నా, రాజమ్మగారి క్రొత్తకోడలు కొంచెం ఆధునిక సంస్కారం గలామె అవటమూ, తల్లి అభిప్రాయలకి వ్యతిరేకంగా ఆనందరావా మెని ప్రేమించి వివాహం చేసుకోవడమూ తెలిసి ఉన్న మహాలక్ష్మమ్మ యీ రెండు విషయాలకీ ఏదో బాదరాయణ సంబంధం ఉండి తీరుతుందని నిశ్చయించుకుని, కొంత సుఖకరమైన విధంగా సర్దుకుని కూర్చుని, మాట్లాడకుండా వినసాగింది.

ఒక నిముషపు నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ రాజమ్మే తిరిగి అన్నది:

"మొన్న మావాడు మామూలుగా ఆఫీసుకి వెళ్ళి కూర్చుని వ్రాసుకుంటున్నాడట— వాడిసంగతి మీకు తెలియదు గనకనా? ఎవరి జోలి కొవాలి?"

ఆ సిద్ధాంతానికి బలం ఇస్తూ మహాలక్ష్మమ్మ "అయ్యో! నాకు తెలియకేం? ఈ మూడేళ్ళూ ఎంత జాగ్రత్తగా పనిచేశాడు కాదు?" అన్నది.

ఆమె పూర్తిగా అపకుండానే రాజమ్మ అందుకుని అన్నది: "ఆ. మొన్న మేనేజరు వచ్చాడట. మా ఆనందం డ్రాయర్లో చీరెనూ, పూవులగుత్తినీ చూసి 'ఇలాగేనటండీ ఆఫీస్ పని?' అని విరుచుకు పడ్డాడట. ఆమట్టున హెడ్ గుమాస్తాని పిలచి "ఏమయ్యా? ఈ పంతులు పని సంతృప్తికరంగా లేదని ఇంతకు ముందే ఎందుకు రిపోర్ట్ చెయ్యలేదు? వెంటనే ఇతని సంగతి రిపోర్టు చెయ్యి! అని చెప్పి వెళ్ళాడట."

"అయ్యో వీడి మొహంకొల్చ!"

"ఏముందింక? మేనేజరు చెప్పాడు గదా అని ఆ గుమాస్తా ఉన్నవీ లేనివీ కల్పించి వ్రాసిపంపాడట."

"వాడికేం పొయ్యేకాలమమ్మా? పండంటి పనివాడిమీద చిరాపరా వ్రాయడానికి వాడి చేతులెల్లా వచ్చాయో!"

"ఏముందమ్మా ఆఫీసరు అంటే మరి? అందులో ఆ మేనేజరు చాలా ఘటికుడట. ఆనందంకొన్న అరవైరూపాయిల చీర చూసేసరికి వాడికళ్ళు కుట్టాయి కాబోలు. లంచం తిన్నాడేమోనని వాడి బాధట! దరిద్రుడు!"

"అయితే ఆ చీర ఆనందందే నన్నమాట."

"కాకేం? వాడిదగ్గర కురెవరివుంటాయి?"

"ఇంటికి పట్టుకురాక—ఆఫీసు కెళ్ళేదారిలో కొన్నాడేం?"

"అదేనమ్మా విడ్డూరం. ఆనాడు రాణీగారి పుట్టినరోజట. నాలుగురోజుల ముందే ఆ చీర బొంబాయినించి తెప్పించి దానికి ఆశ్చర్యం కలిగించేలాగ ఇవ్వాలని అలా చేశాడట. అదేం వింతో? మన కొలాల్లో ఇలాటివేమా లెరుగుదుమా ఒదినా!"

''మనం మనుష్యుల్లో జమకాదమ్మా ఈ పిల్లల దృష్టిలో...ఐతే, అదా సంగతి. బోధపడింది.''

''కాకపోతే మాత్రం అరవైరూపాయిలు పెట్టి చీర ఏమిటి? ఆ చీర ఎంత చేసింతో చూశావా?''

''రోజులమ్మా...రోజులు! అవి బాగా లేకపోతే ఇలాగే ఉంటుంది.''

''రోజు లేమిటమ్మా? మూడునెలలు తిరగకుండా చూచారా ఎంతయిందో? ఒక్కొక్కరి కాలిప్రభావం అది!''

మహాలక్ష్మమ్మకు రాజమ్మ ఉద్దేశం బోధపడింది. పిచ్చాపాటీ మాట్లాడుకుని ఇంటికి సాగింది. ప్రక్కగదిలోంచి సంభాషణ వింటూన్న లలిత బరువుగా మేడమీదికి నడిచింది.

దూరాన కొండల నునుపుని చూస్తూ లలిత ఆలోచించుకో సాగింది అత్తగారి మాటల అంతరార్థపు వైపరీత్యం.

భర్తకి తానంటే విపరీతమైన అభిమానం. కాని, పాపం ఆయనకి విషయమంతా ఏం తెల్సును? ఆఫీసులో జరిగే విషయాలకీ, తన ఉనికికీ సంబంధం ఉందని ఆయన కెలాగ తెడుతుంది?

తన పరిస్థితి ఎంత విపరీతం? తను కాలు పెడితే భర్త ఉద్యోగం పోయింది? ఏమి అపచారానికి అత్తగారికి తనపై ఆకసి? ఆనందరావామె కుమారుడు కాదూ?

ఈ విషయం అత్తగారు అలాగునఅంది అని తానే ఆయనకి తెలియ చెయ్యకపోతే ఈ విచారానికి అంతం ఉండదు.

కాని...అలాగ చెప్పడం ఆయన సుఖమయ జీవితంలో అగ్నిని వెయ్యడమే!

సాయంత్రం భారంగా ఇంటికి వచ్చాడు ఆనందరావు. ఏమీ విశేషం లేనట్టే ప్రవర్తించడానికి ప్రయత్నిస్తూ లలిత తన అంతర్బాధ చాలా అణగ ద్రొక్కుకుంది.

కాని మానసిక బాధని అణచుకోడానికి వీలులేదు. లలిత దిగాలుగా ఉండడం చూసి ఆనందరావు కాఫీ త్రాగుతూ అన్నాడు:

''అలాగున్నావేం లలితా?''

లలిత చాలా కలవరపడ్డది. ఒక్కసారి సముద్రం అలలులాగ దుఃఖం లేచింది ఆమె ఎదలో. కాని దాన్నంతటినీ అణుచుకునే ప్రయత్నంలో ఆమెకి మౌనం మాత్రమే సహాయపడింది.

కొంచెం సేపయ్యాక లలిత కళ్ళల్లోకి బాధగా చూస్తూ అన్నాడు ఆనందరావు: ''నా ఉద్యోగం పోతుందేమోనని బాధపడుతున్నావా? ఈ డిగ్రీకి ఆపాటి విలువ ఉంది. మన జీవితంలో డబ్బుకోసం ఎప్పుడూ బాధపడం. విచారించకు లలితా.''

లలిత పరీక్షగా చూసి జవాబేమీ ఇవ్వకుండానే కప్పు పట్టుకుని మేడ దిగింది. దిగుతూంటే ఆమె అంతరంగం అన్నట్లయింది:

''పాపం! ఆనందరావు నీ దుఃఖాన్నీ, మనోవ్యథనీ సహించలేడు'' అని.

అందుకే ఆమె ఆయనతో ఈ పరిస్థితి అంతా చెప్పి ఆయన మనశ్శాంతిని చెరపకూడదని నిశ్చయించుకుంది. ఆ బాధని తన హృదయంలోనే భద్రపరిచింది.

* * *

మధ్యాహ్నం మూడయింది.

ఆధ్యాత్మ రామాయణం ముందు పెట్టుకుని తీరుబడిగా కూర్చుంది రాజమ్మ. ఇంతట్లో అన్నపూర్ణ బాతాఖానీకి వచ్చింది.

అన్నపూర్ణ భర్తా, ఆనందరావు పనిచేసే కంపెనీ మేనేజరూ చాలా స్నేహితులు. లలిత విషయంలో అన్నపూర్ణకి చాలా సింపతీ వుంది. అందుచేత అర్ధ హృదయంతో ఆమె సాహ్వానిస్తూ రాజమ్మ ''రండి-రండి'' అన్నది.

నవ్వుతూ అన్నపూర్ణ ''వస్తూనే ఉన్నానుగా? తీరుబాటుగా ఉన్నారు అబ్బాయి ఇంటిదగ్గరే ఉన్నారనా? లలిత ఏంచేస్తూంది?''

రాజమ్మ ఏదో సమాధానంలాంటిది ఇస్తూ ''విశేషా లేమిటమ్మా?'' అంది.

''విశేషాల కేంగాని మీకో మంచి వార్త తెచ్చాను. ఏమిటిస్తారూ?'' అంది నవ్వుతూ.

లలితా, ఆనందరావూ జాగ్రత్తగా వినసాగారు సంభాషణ.

రాజమ్మ రామాయణం మూస్తూ, ''మీకేం అడ్డుంది, ఏది కావలిస్తే అది. కాని, ఏమిటో

చెప్పరూ" అన్నది కొంత ఆందోళనగా.

అన్నపూర్ణ నెమ్మది నెమ్మదిగా, "అబ్బే, ఏమీలేదూ. కంపెనీలో తగూ వచ్చిందిట కదూ ఆయనకి?... అది. ఇంకాయన కంపెనీ గుమాస్తాగా పనిచెయ్యక్కరలేదు" అని ఆపింది.

రాజమ్మ గుండె ఝల్లు మన్నది. లలితకి ముఖం తిరిగినట్లయింది. ఆనందరావు పిడుగు పడ్డట్టు చూచాడు.

అన్నపూర్ణ మళ్ళా అంది : "మీ కోడలు అదృష్టం లెండి."

లలిత తృళ్ళిపడింది. ఆమెకి ముచ్చెమటలు పోసి భర్తవేపు చూడలేకపోయింది.

అన్నపూర్ణ నవ్వుతూనే: "అదేమండీ అలా చూస్తారు? మీ అబ్బాయి ఇంక గుమస్తాగా వెళ్ళక్కరలేదు. హెడ్ గుమస్తా ఆయనఇంక."

అందరికీ ఆనందం వెల్లివిరిసింది. ఆనందరావు లలితని దగ్గరగా తీసుకున్నాడు.

అన్నపూర్ణ తిరిగి అంది : "హెడ్ గుమస్తా ఒక్తి చచ్చుట. మేనేజరు రిపోర్టు వ్రాయమన్నాడుకదా అని వ్రాశాడట. మీఅబ్బాయి తనపనిలో లోటేమీ లేదనీ, పరీక్ష చేసుకోమనీ, ఇంకా తృప్తి లేకపోతే తనకా ఉద్యోగము అక్కరలేదనీ వ్రాశారట. లోపాలు చూపమనేసరికి హెడ్ గుమస్తా తెల్లముఖం వేశాడట.

దాంతో ఆ హెడ్ గుమస్తా పత్రి త్యాపుం అని వ్రాసి మీ అబ్బాయి న్నా పనికి సిఫారసు చేశాడట మేనేజరు. ఈ తగూ అంతా ఆయన మీ అబ్బాయికి ప్రమోషన్ ఈయడానికి వేసిన నాటకం!"

సంతోషంతో సంతృప్తిగానవ్వింది రాజమ్మ. "చూశావా? అనవసరంగా భయపడ్డావ్" అన్నాడు ఆనందరావు భార్యని సముదాయిస్తూన్నట్టుగా.

"చాలా మంచి కబురు తెచ్చావమ్మా" అంది రాజమ్మ.

అన్నపూర్ణ : "మీ కోడలు అడుగు పెట్టిన వేళా విశేషం అనండి" అంది.

రాజమ్మగారు :"మామ్మాటికీ అంతేనమ్మా" అంది.

లలిత నిశ్శబ్దంగా ఉండిపోవడం చూసి, ఆనందరావు ఆమె ముఖాన్ని తనవేపు తిప్పుకుంటూ, "అదేమిటి లలితా? అలాగున్నావేమిటి మంచి వార్త విని?" అన్నాడు ఆశ్చర్యంగా ఏమీ అర్థంకాక.

వేదాంతిలాగ అన్నది లలిత : "ఏమీలేదు. ఇలా జరగకపోతే ఏమవునో అని ఆలోచిస్తున్నాను."

నవ్వుతూ ఆనందరావు : "నా డిగ్రీకి ఆ పాటి గౌరవం ఉందని చెప్పాను కాదూ. పిచ్చిదానా! ఆ బాధ పడవద్దన్నాను కాదూ?" అని సముదాయించాడు.

అతని కళ్ళల్లోంచి హృదయంలోకి చూస్తూ లలిత అనుకుంది, ఆ పరిస్థితి ఆయన కెన్నడూ అర్థం అవదని.

---

# ప్రగతి

"సుధ"

కాలేకడుపు కూలే దొక ప్రక్క,
 వేలే కడుపు ఏలే దీ ప్రక్క,
లేదని చెప్పుకోలేని
కడుపును నింపుకోలేని
క్షుధ్బాధకపు అసమర్థత మరో ప్రక్క!
అంతా
ఎత్తుల, పల్లాల, లోయల, నదుల, మయం!
అంతా
అరల, తెరల, మరుల, మయం!
సమ్మట్టములేని చోటు, సర్వమ్మో భూభాగం.
సంఘర్షణలో మండుతోంది సంతతమీ
 భూగోళం.